ప్రజాశక్తి
శనివారం 7 అక్టోబర్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

తగ్గుతున్న పశుపోషణ

గేదెలు, ఆవుల పెంపకంపై నిరాసక్తత



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పశుపోషణ క్రమంగా తగ్గుతోంది. వేర్వేరు కారణాలతో గత ఐదేళ్ల కాలంలో పశుపోషణ తగ్గింది. గుంటూరు జిల్లాలో నాలుగేళ్ల క్రితం 26 వేల ఆవులు ఉండగా ప్రస్తుతం 16,899 ఉన్నాయి. వీటిల్లో ఉత్పాదక ఆవులు 5069 మాత్రమే ఉన్నాయి. గేదెలు రెండున్నర లక్షల నుంచి ప్రస్తుతం 1,98,009కు తగ్గాయి. గొర్రెలు, మేకలు తప్ప ఆవులు, గేదేలు సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. జిల్లాలో గొర్రెలు 1,25,451, మేకలు 20,451, కోళ్లు 33,65,423 ఉన్నట్టు అధికారుల అంచనా. పాలధరలు భారీగా పెరిగినా గేదెల పోషణ కష్టతరంగా మారింది. పాల ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోవడం, పాలు ఆశించిన స్థాయిలో ఇవ్వకపోవడం, అనారోగ్యానికి గురవుతుండటంతో వీటిని పశువధ సంతలకు విక్రయిస్తున్నారు. పశు పోషణకు ప్రధానంగా గ్రాసం, ఇతర ఆహార పదార్థాలు ధరలు గణనీయంగా పెరగడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఆకస్మికంగా సంభవిస్తున్న వ్యాధులు వల్ల కూడా పోషణకు రైతులు దూరం అవుతున్నారు.

గతంలో వ్యవసాయంతో పాటు పశుపోషణలో కూడా భాగస్వామ్యం అయ్యే రైతులు క్రమంగా ఈ రంగం నుంచి దూరం అవుతున్నారు. పశుపోషణ ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన అంశంగా మారడంతో చాలా మంది పశువులను పెంచేందుకు విముఖత చూపుతున్నారు. పశువులకు చికిత్సల నిమిత్తం పశువైద్య శాలలు అందుబాటులో ఉన్నా ఇప్పటి వరకూ ప్రభుత్వం తగినంత మందిని సిబ్బందిని నియమించి సకాలంలో చికిత్సలు అందించడంలో జాప్యం కారణంగా కొన్ని పశువులుగా ఆకాల మరణానికి గురవుతున్నాయి. పశుపోషకులకు కూడా తగిన చేయూత నిస్తామని సీఎం జగన్ గతంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా ఆర్‌బికేలకు అనుసంధానంగా పశుచికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసినా వెటర్నీరీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయడం లేదు. జిల్లాలో 242 రైతు భరోసా కేంద్రాలు ఉన్నా వెటర్నరీ అసిస్టెంట్‌లతో కూడిన చికిత్స కేంద్రాలు 45 మాత్రమే ఉన్నాయి. వెటర్నీరీ అసిస్టెంట్ పోస్టులు 100కుపైగా ఖాళీలున్నాయి.

2019లో సచివాలయాల్లో ఈపోస్టుల భర్తీకి రాతపరీక్షలు నిర్వహించినా అర్హులైన వారు ఎక్కువ మంది లేకపోవడం వల్ల ఖాళీలు ఏర్పడ్డాయి. తరువాత మళ్లీ భర్తీకి ఉత్తర్వులు రాలేదు. గోపాలమిత్రల ఆధ్వర్యంలో పనిచేసే కేంద్రాలు 41 పనిచేస్తున్నాయి. వీటితో పాటు మరో 70 పశు వైద్య కేంద్రాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. గతంలో పశు పోషణకు ఆసక్తి చూపే రైతులు వేర్వేరు కారణాలతో ఈ రంగం నుంచి తప్పుకుంటున్నారు. గత నాలుగేళ్లలో 14,649 మంది రైతులకు చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750తో మహిళలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఒకేచోట భారీ పోషణ కేంద్రాలు ఆవిర్భవిస్తున్నాయి. గతంలో ఒక్కో ఇంటిల్లో మూడు నాలుగు గేదెలు, లేక ఆవులు ఉండేవి. ఇప్పుడు ఒకేచోట 50 నుంచి 100 వరకు వివిధ జాతుల పశువులను పోషణతో పాల ఉత్పత్తి కేంద్రాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇవి క్రమంగా మినీ డెయిరీలుగా ఆవిర్భవిస్తున్నాయి.



ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు, యూనియన్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు... కృపమ్మ మృతదేహం (ఇన్‌సెట్)

అధికారుల వేధింపుల వల్లే కృపమ్మ మృతి

రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు ఆశావర్కర్ల యూనియన్ పిలుపు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఉన్నతాధికారుల వేధింపులు, పని వత్తిడి వల్లే తాడేపల్లి ప్రకాష్‌నగర్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆశ కార్యకర్తగా పని చేస్తున్న తాడేపల్లి పట్టణంలోని ముగ్గురోడ్డుకు చెందిన రేపూడి కృపమ్మ (38) మృతి చెందారని ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి తెలిపారు. కృపమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ▶ 2లో



ముఖ హాజరు యాప్‌ను రద్దు చేయాలి

- ఒత్తిడిని తట్టుకోలేక అనారోగ్యానికి గురవుతున్న అంగన్వాడీలు
- పీడీ కార్యాలయంలో ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - నరసరావుపేట

ముఖ హాజరు యాప్ ద్వారా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం ఇచ్చే సమయంలో ఫొటోలు తీసి పోషణ యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం తెచ్చిన యాప్ సరిగా పని చేయకపోవడంతో అంగన్వాడీలు మానసిక ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నారని ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విధానాన్ని తక్షణమే తొలగించాలని కోరుతూ స్థానిక బీసీ కాలనీలోని పీడీ కార్యాలయంలో సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, ఎసిడిపిఒ మాణిక్యరావుకు నాయకులు శుక్రవారం వితనిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ▶ 2లో



ఎసిడిపిఒ మాణిక్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

అదనపు కమిషనర్ బదిలీ నిలిపివేత?

డిఆర్ఎం కప్ పోటీలు ప్రారంభం

2లో

భారాలేసే విధానాలను తిప్పికొట్టాలి

- కేంద్రంలోని బిజెపి విధానాలను తూచ తప్పకుండా అమలు చేస్తున్న రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు
- నాలుగో రోజు కొనసాగిన సిపిఎం ప్రజాచైతన్య పాదయాత్ర

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రజలపై అధిక భారాలు వేసే విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తుండగా వాటిని రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం తూచ తప్పకుండా పాటిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. ఈ విధానాలను ప్రజలు పోరాటాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గంలో సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర నాలుగో రోజైన శుక్రవారం ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడ నుండి ప్రారంభమై చిర్రావూరు, మెల్లంపూడి గ్రామాల్లో కొనసాగింది. పలు సమస్యలపై ఆయా గ్రామాల ప్రజలు పాదయాత్ర బృందానికి వితిపత్రాలు ఇవ్వడంతోపాటు తమ ఆవేదనను వెళ్లబోసుకున్నారు. పాదయాత్రను ప్రారంభించిన బాబూరావు మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక రాజధానిలో ఇళ్లులేని ప్రతి పేదవాడికీ ఇళ్ల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని నమ్మించిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా ఏ ఒక్క పేదవాడికీ సెంటు భూమి ఇవ్వలేదని విమర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వం మూడు ▶ 2లో



పాదయాత్రలో అభివాదం చేస్తున్న సిహెచ్ బాబూరావు, పాశం రామారావు తదితరులు

అదనపు కమిషనర్ బదిలీ నిలిపివేత?

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా కృష్ణాజిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఒ)గా నాలుగు రోజుల క్రితం బదిలీ చేశారు. అయితే ఆమె బదిలీ నిలిచిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆమె గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎలక్ట్రోరల్ అధికారిగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించాల్సిన సమయంలో ఆమె బదిలీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాల రూపకల్పనలో బాధ్యులుగా ఉన్న అధికారులెవర్నీ బదిలీ చేయొద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె బదిలీ ఆగిపోతుందని అధికారవర్గాలు భావిస్తున్నాయి. పెద్ది రోజా స్థానంలో ఇంకా ఎవర్నీ నియమించకపోవడం వల్ల ఇదేస్థానంలో కొనసాగే అవకాశాలున్నాయి.

ముఖ హాజరు యాప్‌ను రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెపి మెటిల్డాదేవి, జి.మల్లీశ్వరి మాట్లాడుతూ అంగనాడీల సమస్యలపై అనేకసార్లు విన్నవించినా పరిష్కరించడం లేదని, పైగా కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్‌నెట్ సమస్య కారణంగా ముఖ హాజరు యాప్‌లో వివరాలు సరిగా నమోదుకు కావడం లేదని, ఈ నేపథ్యంలో రిజిస్టర్‌లో నమోదు చేసి లబ్ధిదారుల నుండి సంతకం చేయించి పోషకాహారం పంపిణీ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ముఖ హాజరుకు వ్యతిరేకం కాదని, హాజరు వేసే విధానం, యాప్ పనితీరు సరిగా లేనందున వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ యాప్ విధానం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఈ నెల 9న శాఖ కమిషనర్ అధికారులతో యూనియన్ నాయకులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట ప్రాజెక్ట్ కార్యదర్శి నిర్మల, సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ పాల్గొన్నారు.



అధికారుల వేధింపుల వల్లే కృపమ్మ మృతి

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం రాత్రి ప్రకాశనగర్ సెంటర్‌లో జరుగుతున్న ఆందోళన వద్దకు వచ్చి మద్దతు తెలిపారు. కృపమ్మ మృతికి అధికారులు న్యాయం చేయడానికి ముందుకు రాకపోవడం విచారకమన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్త నిరసనలకు పిలుపునిస్తున్నట్లు ప్రకటించారు. జగనన్న సురక్ష పేరుతో పనివత్తిడి పెంచి ఆశాల మరణానికి కారణమైన ప్రభుత్వమే భాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కృపమ్మ మృతికి బాధ్యులైన మెడికల్ అధికారి, హెల్త్ విజిటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం చేయకపోతే ఆశా వర్కర్లచేత రాష్ట్ర ప్రభుత్వం పని ఎలా చేయించుకుంటుందో చూస్తామని హెచ్చరించారు. ధనలక్ష్మి మాట్లాడుతున్న సమయంలోనే తాడేపల్లి సిఐ శేషగిరిరావు నేతృత్వంలో పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్న పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ రాత్రి 11 గంటల సమయంలో కూడా ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు, ఆశా కార్యకర్తలు స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. అరెస్టయిన వారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు, ఐద్వా రాష్ట్ర నాయకులు డి.శ్రీనివాసకుమారి, స్థానిక నాయకులు కె.కరుణాకరరావు, బి.వెంకటేశ్వర్లు, మొత్తం 21 మందిని అదుపులోకి తీసుకున్నారు.



భారాలేసే విధానాలను తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

రాజధానుల పేరుతో రాజకీయ చేస్తుందే గాని ప్రజల అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదన్నారు. తాడేపల్లి మండలంలోని పలు గ్రామాలను మున్సిపల్ కార్పొరేషన్ పేరుతో విలీనం చేశాక అభివృద్ధి చేసిందేమీ లేదని, ప్రజలపై పన్నుల భారాలు మాత్రం ఎక్కువయ్యాయని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలపై చెత్తపన్ను, నీటి పన్ను అంటూ భారాన్ని పెంచారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కోకొల్లలుగా సమస్యలున్నాయని, వాటి పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చెప్పారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు అస్తవ్యస్తంగా ఉండడం వల్ల వర్షాలప్పుడు ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచి దుర్గంధం వెదజల్లుతోందన్నారు.

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ తాడేపల్లి మండలంలో రైతులు ప్రధానంగా మురుగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ పంట కాల్వలో చుట్టుపక్కల ప్రాంతాల ఇళ్లల్లోని వ్యర్థపు నీరు కలుస్తోందని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పొలాల్లోకి మురుగునీరు చేరి పంట దిగుబడులు దెబ్బతింటున్నాయని, పొలాన్నీ బీళ్లుగా మారుతున్నాయని చెప్పారు. అధిక వర్షాలప్పుడు పొలాల్లోకి చేరిన వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోజుల తరబడి పొలాల్లోనే నిలిచి పైర్లు దెబ్బతింటున్నాయని, పొలాల్లోని నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మండలంలోని కౌల్దార్లందరికీ గుర్తింపు కార్డులు, పంట రుణాలివ్వాలని, అధిక వర్షాలతో నష్టపోయిన లంక పొలాల రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

నూతక్కి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నూతక్కి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు చేయకపోవడం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సమస్యగా మారిందని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. ప్రజా చైతన్య యాత్ర మండలంలోని నూతక్కిలో పర్యటించిన సందర్భంగా పలు సమస్యలను స్థానికులు పాదయాత్ర బృందం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పేదలు నివాసం ఉంటున్న ఇళ్లకు పట్టాలివ్వాలని, ఇళ్లులేని వారికి స్థలమిచ్చి ప్రక్కా ఇళ్లు నిర్మిస్తామనే హామీని ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. పైగా కాల్వ కట్టల సుందరీకరణ పేరుతో పేదల ఇళ్ల తొలగింపునకు పూనుకుందోని విమర్శించారు. మతోన్మాద బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, పేదల పక్షాన ఎర్రజెండా నిలబడుతుందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర చేస్తున్నామని చెప్పారు. పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి, ఎస్ఎస్ చెంగయ్య, ఇ.అప్పారావు, సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, జిల్లా నాయకులు కె.అజయ్‌కుమార్, మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి, నాయకులు ఎ.రంగారావు, కె.వెంకటేశ్వరరావు, పి.కృష్ణ, బి.సంసోను, వి.వెంకటేశ్వరరావు, ఎం.భాగ్యరాజు, జె.నవీన్, ఎం.పాములు, పి.సుబ్బారావు, బి.గోపాలరావు, కె.జేమ్స్, కె.సాంబశివరావు, వై.కమలాకర్, పి.ప్రసాద్, వి.భారతి, జానారెడ్డి, సుగుణకుమార్, సిహెచ్.బ్రహ్మారెడ్డి, ఎం.బాలాజి, డి.శ్రీను పాల్గొన్నారు. పాదయాత్రలో భాగంగా ప్రజానాట్య మండలి కళకారులు తమ గేయాలతో ఉత్సాహపరిచారు.



పాదయాత్ర బృందానికి వినతిపత్రం ఇస్తున్న మహిళలు



పొలాల్లో డ్రెయినేజీ సమస్యను పరిశీలిస్తున్న నాయకులు

డిఆర్ఎం కప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

క్రీడలు శారీరక, మానసిక ధృడత్వానికి ఎంతో దోహదపడతాయని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. నల్లపాడులోని డిఆర్ఎం మైదానంలో గుంటూరు రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో డిఆర్ఎం కప్ 2023 శుక్రవారం ప్రారంభమైంది. గుంటూరు డివిజన్ రైల్వే మేనేజరు రామకృష్ణతో కలసి పాల్గొన్న కలెక్టర్ బెలూన్లు ఎగరవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. డీఆర్ఎం బౌలింగ్ వేయగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి బ్యాటింగ్ చేస్తు కొద్దిసేపు క్రికెట్ ఆడారు. ప్రారంభ సభలో కలెక్టర్ మాట్లాడుతూ కొంత కాలంగా మంచి ఉద్యోగాలలో స్థిరపడాలనే ఉద్దేశ్యంతో విద్యార్థులు ఉదయం నుంచి రాత్రి వరకు చదువుకే పూర్తి సమయం కేటాయించి క్రీడలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం క్రీడల ప్రాధాన్యం తెలుసుకొని ప్రతి ఒక్కరూ ఆటల్లో పాల్గొనటానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. రైల్వేశాఖ ఉద్యోగులతోపాటు, ఇతర కేంద్ర ప్రభుత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలోని ఉద్యోగులలో క్రీడాస్ఫూర్తి పెంపొదించటానికి తొలిసారిగా డీఆర్ఎం కప్ 2023ను నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. డిఆర్ఎం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సత్సంబంధాలు పెంపొందించాలనే లక్ష్యంతో ఈ క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనటం వల్ల క్రీడాస్ఫూర్తితో పాటు, టీమ్ స్పిరిట్ పెంపొందుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు జిల్లాలు, తెలంగాణాలోని రెండు జిల్లాల్లో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్‌లో 13 టీంలు, వాలీబాల్‌లో 15 టీంలు, బ్యాడ్మింటన్‌లో 25 టీంలు పాల్గొననున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎడిఆర్ఎంలు సైమన్, శ్రీనివాస్, సీనియర్ డిసిఎం దినేష్ కుమార్, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీ, ప్రభాకర్ రాజు పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేసి క్రీడల్ని ప్రారంభిస్తు్న కలెక్టర్, డిఆర్ఎం ఇతర అధికారులు



వ్యాసరచనలో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

విశ్వ నరుడు గుర్రం జాషువా హృదయ ఆవేదనకు ప్రతిరూపం 'గబ్బిలం' కావ్యమని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. జాషువా 128వ జయంతి సందర్భంగా కవి కోకిల శ్రీ గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ - సత్తెనపల్లి ఆధ్వర్యంలో హైస్కూలు, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులను మంత్రి రాంబాబు శుక్రవారం ప్రదానం చేశారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు తెలుగు భాష మీద పట్టు పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ మక్కెన అచ్చయ్య, సంస్థ అధ్యక్ష కార్యదర్శులు యిర్మియా, సురేష్‌బాబు, వివిధ కళాశాలలు ఉపాధ్యాయులు, అధ్యాపకులు శేషగిరి, విశ్వనాథ్, మున్నీసా బేగం, అనురాధ, జోత్స్న, శ్రీనివాసరావు, అశోక్, వైసిపి నాయకులు ఎ.శివప్రసాద్, సిహెచ్.సాంబశివరావు, వై.వెంకటేశ్వరరెడ్డి, పి.సూరిబాబు పాల్గొన్నారు.

రాజ్యాంగం ఇచ్చిన హక్కుల కోసం ఉద్యమాలు



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడం కోసం ఉద్యమాలకు సన్నద్ధం కావాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు అన్నారు. సంఘం ఏర్పడి 25 ఏళ్లవుతున్న సందర్భంగా మండలంలోని రెంటపాళ్లలో శుక్రవారం జెండాను నాయకులు డి.ప్రభాకరరావు ఎగురవేశారు. అనంతరం రవిబాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హరిస్తోందని, మనువాదాన్ని అమలు చేసేందుకు పూనుకుందని విమర్శించారు. అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చేందుకు కుట్రలు పన్నారన్నారు. రాష్ట్రంలోనూ దళితులపై దాడులు, అత్యాచారాలు తీవ్రంగా పెరుగుతున్నాయని, దాడులు చేసిన వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చే విధానాన్ని అమలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 4న ఢిల్లీలో జరగనున్న మహాధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బి.రామారావు, జె.భగత్, డి.నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు, సిహెచ్.ప్రసాదు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులు కోటేశ్వరరావు మృతి



ప్రజాశక్తి-ముప్పాళ్ల : విశ్రాంత ఉపాధ్యాయుడు, యుటిఎఫ్ నాయకులు కోండ్రు కోటేశ్వరరావు (90) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మండలంలోని తొండపికి చెందిన కోటేశ్వరరావు 35 ఏళ్లపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడేవారని పలువురు నివాళులర్పించారు.



'జగనన్నకు చెబుదాం'కు 39 అర్జీలు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రత్తిపాడులో జగనన్న చెబుదాం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల నుండి అందిన ఫిర్యాదులను మరింత మెరుగ్గా పరిష్కరించేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని ప్రారం భించినట్లు చెప్పారు. మొత్తం 39 ఫిర్యాదులు రాగా, వాటిలో అధిక భాగం రెవిన్యూ, పంచాయితీ రాజ్ , ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖకు సంబంధించినవే వున్నాయన్నారు. పం చాయితి రాజ్ , ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖకు సంబంధించి ఆగి పోయిన పను లను కొనసాగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగానే ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అత్యంత ప్రాధాన్యతను అధికారులు గుర్తించి బాధ్యతతో ఫిర్యాదులను సహేతుకంగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమం ప్రారంభించిన గంటన్నర వరకు ఏడు అర్జీలు మాత్రమే వచ్చాయి. కొద్దిసేపు అర్జీలు రాక జాయింట్ కలెక్టర్ రాజకుమారి, ఆర్డీవో ఖాళీగా కూర్చున్నారు. మండల స్థాయి అధికారులను పిలిచి ప్రజలకు తెలియజేయలేదా అని ప్రశ్నించినట్లు సమాచారం. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజకుమారి, ఆర్డీవో, డిప్యూటీ కలెక్టర్ స్వాతి, జెడ్పీ సిఈఓ జె.మోహన్ రావు, పీడీ డీఆర్డీఏ హరిహర నాథ్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ , జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంక టేశ్వర్లు, ఉద్యాన శాఖ ఏ.డి రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 24,052
మిర్చి ఎగుమతి	: 27,490
మిర్చి నిల్వ	: 8,068

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 23,000
నెం.5	16,200 - 23,000
273	14,500 - 19,000
341	10,500 - 23,000
సూపర్ 10	17,000 - 17,000
	నాన్ ఎసి
తేజ	10,000 - 25,000
బడిగి	13,000 - 26,000
దేవనూరు డీలక్స్	14,500 - 16,500
తాలుకాయలు	5,000 -14,000
	ఎసి
334	13,000 - 22,000
నెం.5	19,200 - 19,200
273	18,500 - 20,700
341	15,600 - 21,500
తేజ	10,000 - 23,500
బడిగి	9,500 - 25,000
దేవనూరు డీలక్స్	19,000 - 21,000
తాలుకాయలు	6,000 -13,000

సురభిపై అక్రమ కేసు బనాయించిన ఎమ్మెల్యే

ప్రజా ప్రతినిధులు,అధికారుల బాధిత పోరాట సంఘం

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ నియోజకవర్గంలోని కొందరు విలేకరుల స్థలాల విషయంలో సురభి వెంకటేశ్వర్లు అడ్డువస్తున్నాడని, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయించారని నియోజకవర్గ ప్రజాప్రతినిధులు అధి కారులు బాధితుల పోరాట సంఘం నాయకులు కె.హనుమంత్ రెడ్డి, మేడం రమేష్, మహం కాళి సుబ్బారావులు అన్నారు. వినుకొండ సబ్ జైల్లో రిమాండ్ లో ఉన్న సర్వే వెంకటేశ్వర్లు పరామర్శించేందుకు వెళ్లిన నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని గద్దల బోడు సర్వేనెంబర్ 229-3-6 లో 1-47 ఎకరాల భూమిని సురభి వెంకటేశ్వర్లు గతంలో కొనుగోలు చేసి ఉన్నారని తెలిపారు. అదే భూమిని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నియోజకవర్గంలోని కొందరు విలేకరులకు నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నించగా తన భూమికోసం కొనుగోలు చేసిన సురభి వెంకటేశ్వర్లు గత కొంతకాలంగా న్యాయపోరాటం చేస్తున్నారని అన్నారు. జనవరి 13వ తేదీన పుల్లల చెరువు మండలం రెంట



పాళ్ల తండాకి చెందిన బాణావత్ మోహన్ నాయక్ చేత బ్రహ్మ నాయుడు ఫిర్యాదు ఇప్పించగా వినుకొండ పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. సురభి వెంకటేశ్వర్లు పై అక్రమంగా బనాయించిన ఎస్సీ,ఎస్టీ కేసు అరెస్టు పట్ల రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఖండించాలని వారు కోరారు. నిబంధనల ప్రకారం వినుకొండ నియోజకవర్గ విలేకరులకు ఇండ్ల స్థలాలు ఆయా మండల కేంద్రాల్లో ఇవ్వాలని, నియోజకవర్గంలో ఐదు మండలాల విలేకరులకు వినుకొండలో ఇవ్వడం సబబు కాదని అన్నారు.



ముగ్గురు జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణ పరిధిలోని ఎరుకల కాలనీలో ని సపోటా తోటలో పేకాట ఆడుతున్న ముగ్గురిని గురువారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. పొన్నూరు టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ ఎండి కాజా అల్తాఫ్ హుస్సేన్, సిబ్బంది కానిస్టేబుల్ పోతురాజు, ఏఎస్ఐ వీరాంజనేయులు తో కలిసి దాడి చేశారు .వారి వద్ద నుండి రూ.3,160 నగదు స్వాధీనం చేసుకున్నారు . జూద రులను శుక్రవారం కోర్టులో హాజరు పరిచినట్లు సిఐ తెలిపారు.

జల్సాకు అలవాటుపడి మోసం.. దొరికిన నిందితులు

ప్రజాశక్తి-మేడికొండూరు

జల్సాలకు అలవాటు పడ్డ బావ, బావ మరిది తమ వాహనం చోరీకి గురైందంటూ తప్పుడు ఫిర్యాదు చేసి.. ఫైనాన్స్ కిస్తీలు ఎగ వేసి, ఇన్సూరెన్స్ డబ్బు తీసుకోవచ్చని మాస్టర్ ప్లాన్ రూపొందించారు. పోలీసుల చాక చక్యం తో వారు కటకటాల పాలయ్యారు. మేడి కొం డూరు సిఐ కె.వాసు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం రైలు పేటకు చెందిన కోట్ల భార్గవ కారు మెకానిక్ గా పనిచేస్తుంటాడు. 2014 నుండి ఇతను గుంటూరు లోని ప్రముఖ కార్ల కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. దీనితోపాటు సెకండ్ హ్యాండ్ కార్లు కొని తిరిగి మరలా అమ్మడం ద్వారా వచ్చే డబ్బుతో జల్సాలు చేస్తుం టాడు. ఇదే క్రమంలో భార్గవకు సిరిపురానికి చెందిన యువత లక్క వీరేంద్రతో పరిచయం ఏర్పడి ఇరువురు వివాహం చేసుకున్నారు. అప్పటినుండి భార్గవ సిరి పురం లోనే నివ సిస్తున్నాడు. తన బావమరిది లక్కా రాజశేఖర్ ఇటీవల మహీంద్రా దోస్త్ వాహనాన్ని కొనుగోలు చేశాడు. ఈ వాహనాన్ని రాజశేఖర్ తన భార్య రమ్య పేరుపై రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ వాహనం కొనేందుకు గుంటూరులోని ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ లో రెండు లక్షల 50 వేల రూపాయలు లోన్ తీసుకొని 8 నెలల పాటు వాయి దాలు చెల్లించారు. బాడుగలు లేకపోవడంతో వాయిదాలు చెల్లించలేకపోతున్న విషయాన్ని రాజశేఖర్ , భార్గవకు చెప్పాడు. దీంతో భార్గవ ఒక మాస్టర్ ప్లాన్ ఆలోచిం చాడు. ఈ ప్లాన్ లో భాగంగా ఆ వాహనాన్ని దాచిపెట్టి.. దొంగతనాన్ని గురైందని పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయించి, ఫైనాన్స్ కిస్తీలు ఎగ్గొట్టవచ్చని, ఇన్సూరెన్స్ డబ్బులు తీసుకోవచ్చని రాజశేఖర్ కు వివరించాడు. రాజధాని ప్రాంతంలోని పెనుమాక పరిసరాల్లో ఆ వాహనాన్ని దాచారు. గత నెల 21న మేడికొండూరు పోలీసులకు సిరిపురం రోడ్ లోని స్పిన్నింగ్ మిల్ శివారులో రిపేర్ వచ్చి ఆపిన తమ వాహనం చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశారు. సిఐ ఆదేశాల మేరకు ఎస్ఐ ఎ.మధు భవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో అసలు విషయం బయటపడింది. మేడి కొండూరు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను విచా రించి, దాచిన వాహనాన్ని రికవరీ చేసినట్లు సిఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ కె.వాసు

ఎన్నారైలో ద్విచక్ర వాహనం చోరీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

చినకాకాని ఎన్నారై హాస్పిటల్ స్టాఫ్ పార్కింగ్‌లో ఉంచిన అంబటి కల్యాణ్ కు చెందిన ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం గుర్తు తెలియనివ్యక్తి అపహరించుకుపోయాడు. కల్యాణ్ ఎన్నారై స్టోర్ డిపార్ట్మెంట్లో అటెండర్ గా పని చేస్తున్నాడు. ప్రతిరోజు మాది రిగానే కాజ నుండి ద్విచక్ర వాహనంలో వచ్చి హాస్పటల్ ఆవరణలోని స్టాప్ పార్కింగ్లో తమ వాహనాన్ని ఉంచి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం వాహనంలో ఉంచిన ఓపి కార్డు కోసం వచ్చి చూడగా పార్కింగ్లోని తన వాహ నం కనిపించలేదు. ఆసుపత్రి సీసీ పుటే జీలో పరిశీలించగా ఓ గుర్తు తెలియని వ్యక్తి తలకు టోపీ, ముఖంకు మాస్క్ ధరించి ద్విచక్ర వాహనాన్ని అపహరించుకుపోవడాన్ని గమనిం చాడు. ఈ మేరకు రూరల్ పోలీ సులకు ఫిర్యాదు చేశాడు.

అప్పు పుడితేనే ఇల్లు గడిచేది..!

- నెలల తరబడి జీతాలు రాకా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తిప్పలు
- కార్యాలయ నిర్వహణకు సొంత డబ్బులే ఖర్చు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పేరుకు ప్రభుత్వ ఉద్యోగి అని సమాజంలో గొప్పగా చెప్పుకుంటున్నా వచ్చేది మాత్రం అరకొర జీతం.. అది కూడా సమయానికి అందక కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన దుస్థితిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బతుకులీడుస్తున్నారు. వ్యర్థాలను తొలగించే వాహనాల (క్లాప్) డ్రైవర్లకు ఆరు నెలలుగా, మెప్మా ఆర్‌పీలకు నాలుగైదు నెలలుగా జీతాల్లేవు. మిగతా శాఖల్లో ఉద్యోగులదీ ఇదే పరిస్థితి. దీంతో వీరు కుటుంబ పోషణతోపాటు ఇంటి అంద్దెలు, వైద్య ఖర్చులు, ఇతర ఖర్చులకూ అప్పులు చేస్తూ నానా అవస్థలు పడుతున్నారు. ఒక గుమస్తా స్థాయి ఉద్యోగికి తన ఉన్నతాధికారుల వద్ద రూ.రెండు వేలు చొప్పున తీసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తుండగా తల్లిని ఆస్పత్రిలో చూపించడానికి అప్పు కోసం చేయి చాచాల్సిన దుస్థితి ఏర్పడింది.



మండల స్థాయిలో సుమారు 40 వరకూ ప్రభుత్వ శాఖల్లో మూడున్నర వేల మంది వరకూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నట్లు అంచనా. వీరికి ప్రతినెలా వచ్చే జీతం రూ.9 వేల నుండి రూ.16 వేలలోపే. ఇవి కూడా కొన్ని శాకలకు నాలుగు నెలల నుండి మరికొన్ని శాఖల్లో ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వలేదు. అధికారి హోదా ఉద్యోగులకూ రెండు మూడు నెల్లుగా జీతాలు లేకపోవడం గమనార్హం. ఇప్పటికే పెరిగిన ధరలతో జీతాలు చాలకపోతుంటే మరోవైపు కొద్దిపాటి జీతాలు కూడా నెలల తరబడి ఇవ్వకుంటే ఇల్లు ఎలా గడస్తుందని ఉద్యోగులు ఆవేదనకు గురవుతున్నారు.

ఇదంతా ఒకెత్తయితే వీరు ఉద్యోగులనే కారణంతో వీరి కుటుంబాల్లోని ఇతరులకు వచ్చే పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాల్లో కోత పెట్టారు. మరోవైపు కార్యాలయాల నిర్వహణ ఖర్చులనూ ప్రభుత్వం విడుదల చేయని కారణంగా వాటినీ ఉద్యోగులే భరించాల్సి వస్తోంది. ఇటీవల ఒక కార్యాలయం బాగా శిథిలావస్థకు చేరడం, ఎలుకలు గుంతలు పెట్టడంతో రూ.30 వేల సొంత డబ్బులతో మరమ్మతు చేయించుకోవాల్సి వచ్చింది. అద్దె భవనాల్లో ఉండే కార్యాలయాలకూ అద్దెలు విడుదల చేయని కారణంగా దాన్నీ ఉద్యోగులే భరిస్తున్నారు. ఎపిఎస్ఐడిసి భవనానికి నెలకు రూ.2 వేల అద్దెను అందులోని ఉద్యోగులు చెల్లిస్తున్నారు.

5వ తేదీలోపు జీతాలివ్వాలి

పి.వెంకటేశ్వర్లు, సిఐటియు మండల కార్యదర్శి.

జీతాలే ఆధారంగా జీవనం సాగించే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయడంతోపాటు 5వ తేదీలోపు జీతాలివ్వాలి. ఇప్పటికే ధరలు పెరిగి జీతాలు చాలకపోతుంటే వాటిని పెంచాల్సిన ప్రభుత్వం కనీసం సమయానికైనా ఇవ్వకపోతే ఉద్యోగుల కుటుంబాలు ఎలా గడుస్తాయో ప్రభుత్వం ఆలోచించాలి. పైగా ఆయా కుటుంబాల్లోని వృద్ధులు, వికలాంగులకు పింఛన్లూ ఆపేయడం సరికాదు.

మేనిఫెస్టోల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న అల్లాడి దేవ కుమార్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమ, అభివృద్ధి, రక్షణకు ప్రాధాన్యమివ్వాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డిబిఆర్‌సి) రాష్ట్ర కార్యదర్శి ఎ.దేవకుమార్ అన్నారు. దళిత ఆదివాసి మేనిఫెస్టో-2024 అంశంపై నరసరావుపేట స్టేషన్ రోడ్డులోని విజయ రెసిడెన్సి మీటింగ్ హాల్‌లో జిల్లాస్థాయి సదస్సు డిబిఆర్‌సి రీజినల్ కో-ఆర్డినేటర్ ఎం.చిన్నప్ప అధ్యక్షతన శుక్రవారం జరిగింది. దేవకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు 23 శాతానికి పైగా ఉన్నారని వారికి సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి రాబోయే ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని కోరారు. దీనిపై డిబిఆర్‌సి ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించి వివరాలు సేకరిస్తామని, ఆ అంశాలను రాజకీయ పార్టీలకు ఇస్తామని చెప్పారు. హ్యాండ్సఫ్ కంపాషన్ సంస్థ డైరెక్టర్ సన్నీ మాట్లాడుతూ దళిత, గిరిజనులకు ప్రభుత్వం విద్యార్థినీ, విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని, మహిళలకు కుట్టు శిక్షణా కార్యక్రమాల ద్వారా ఆదాయాన్ని పొందే మార్గాలను ప్రభుత్వాలు చూపాలని కోరారు. డిబిఆర్‌సి రాష్ట్ర మహిళా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల పిల్లలు, మహిళలు విద్య, ఉపాధి రంగాల్లో వెనకబడి ఉన్నారని, దాడులు, హత్యలు, అత్యాచారాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. డిబిఆర్‌సి నరసరావుపేట సిటీ కో-ఆర్డినేటర్ వేణు మాట్లాడుతూ సంచార జాతులు, చిత్తు కాయితాలు ఏరుకొని డంపింగ్ యార్డుల్లో జీవించేవారు, గంగిరెద్దులు ఆడించేవారు, హరిదాసులు ఇప్పటికీ దుర్భర దారిద్ర్యంలో ఉన్నారని, విద్య దూరమై, కూటి కోసం, వలసలు వెళుతున్నారని చెప్పారు. వీరి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. కార్యక్రమంలో డిబిఆర్‌సి ఏరియా మహిళా కో-ఆర్డినేటర్ జి.కోటిరత్నం, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు ఎ.మోహన్, కె.కోటేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్, ప్రథం సంస్థ కో-ఆర్డినేటర్ ఫణిద నాయక్, బేడ బుడగ జంగాల సంఘం నాయకులు కె.శ్రీనివాసరావు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

పుట్టినరోజు వేడుకల్లో డాక్టర్ సింగరాజు సాయికృష్ణ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని అనన్య హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక పల్నాడు రోడ్డులోని హాస్పిటల్‌లో డాక్టర్ సాయికృష్ణ పుట్టిన రోజు వేడుకలను ఆయన మిత్రుల సమక్షంలో నిర్వహించారు. డాక్టర్ సాయికృష్ణను ఆయన మిత్రులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కేక్‌ను సాయికృష్ణ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా మిత్రులు శ్రేయోభిలాషులు వచ్చి శుభాకాంక్షలు తెలిపినందుకు కృతజ్ఞతలు చెప్పారు. సింగరాజు ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు నిర్వహించిన పలు



సామాజిక కార్యక్రమాలు ప్రజలు సద్వినియోగ పరచుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కరోనా కష్టకాలంలో తాము అందించిన సేవలతో కరోనా నుండి కోలుకున్న వారంతా తమను వారి కుటుంబ సభ్యులుగా ఆదరిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. అత్యున్నత ప్రమాణాలు కలిగిన కార్పొరేట్ వైద్యం నిరుపేదలకు అందిచడమే లక్ష్యమన్నారు. భవిష్యత్‌లో సింగరాజు ఫౌండేషన్ మరియు అనన్య హాస్పటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు తమ సేవలను కొనసాగిస్తామని చెప్పారు.



భారీ వృక్షాల నరికివేత

ప్రజాశక్తి - యడ్లపాడు

జగనన్న కాలనీలకు విద్యుత్ లైన్ల పేరుతో భారీ వృక్షాలను విద్యుత్ శాఖ అధికారులు నరికేయిస్తున్నారు. మండలంలోని చెంఘీస్‌ఖాన్‌పేటలో కాలనీకి బోయపాలెం నుండి విద్యుత్ లైన్ల కోసం రోడ్డుకిరువైపులా చెట్లను కొట్టేయిస్తున్నారు. ప్రత్యామ్నాం చూడకుండా ఇలా ఏకపక్షంగా చెట్లను నరికేయడంపై విమర్శలు వస్తున్నాయి.



రికార్డులను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

రైతులను ఇబ్బంది పెట్టొద్దు : జెసి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భూములు రీసర్వేను వేగవంతం చేయాలని అధికారులు, సిబ్బందిని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సత్తెనపల్లి తహశీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేసిన జెసి మాట్లాడుతూ భూములు రీసర్వేలో రైతులను భాగస్వామ్యులను చేయాలని సూచించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తహశీల్దార్ సురేష్‌కు సూచించారు. జెసి వెంట ఆర్‌డిఒ బిఎల్ఎన్ రాజకుమారి ఉన్నారు.

నాణ్యమైన నారునే ఇవ్వండి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నర్సరీ నిర్వాహకులు నాణ్యమైన విత్తనాలు ద్వారా పెంచిన నారునే రైతులకు అందించాలని, నాసిరకం మొక్కలు అంటగడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఉద్యాన అధికారి బిజె బెన్ని అన్నారు. దుర్గి, మాచర్ల, వెల్దుర్తి మండటాల్లోని షేడ్ నెట్ నర్సరీలను, ఫార్మ్ పాండ్స్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. నర్సరీ చుట్టూ ఇన్సెక్ట్ ప్రూఫ్ నెట్ ఉండాలని, వాటికి రంధ్రాలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. డబల్ డోర్ కచ్చితంగా కలిగి ఉండాలన్నారు. నర్సరీకి సంబంధించిన ఏడు రకాల రిజిస్టర్లలో పూర్తి వివరాలు నమోదు చేయాలన్నారు. నర్సరీ లోపల ప్రతి బెడ్ నందు పోసిన నారు రకము, వెరైటీని మరియు నాటిన తేదీని మొదలగు వివరాలను బోర్డును ఏర్పాటు చేయాలని చెప్పారు. విత్తనాల బిల్లులు, జిఒటి రిపోర్టులు తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేకున్నా, రైతులకు రసీదు ఇవ్వకున్నా చర్యలుంటాయని చెప్పారు. నీటి వసతి తక్కువగా ఉన్న రైతులు పొలంలో ఫామ్ పాండ్స్ తీసుకొని టార్పాలిన్ షీట్ వేసుకొని నీటిని నిల్వ చేసుకోవాలని, వాటిని పైరుకు పెట్టుకోవాలని, ఇందుకుగాను ఉద్యాన శాఖ అందించే రాయితీని పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాచర్ల ఉద్యాన అధికారి ఎన్.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.





నాక్ బృందానికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

మాచర్ల డిగ్రీ కాలేజీకి నాక్ బృందం

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళశాలను నాక్ బృందం శుక్రవారం పరిశీలించింది. కాలేజీలోని లైబ్రెరీ, ల్యాబ్‌లను, కంప్యూటర్ తదితర విభాగాలను పరిశీలించి ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారికి పలు సూచనలు చేశారు. పలు అంశాలపై సభ్యులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రిన్సిపాల్ వివరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులతో నాక్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎన్‌వి కళ్యాంకర్, డాక్టర్ బిశ్వంభర మిశ్రా, డాక్టర్ టిఎం జోసఫ్ సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు, పోలవరం ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీరు బుర్రి సుధాకార్‌బాబు మాట్లాడుతూ కళశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కళాశాలకు రూ.15 లక్షల పరికరాలను పూర్వ విద్యార్థులు అందించినట్లు విద్యార్థుళు తెలిపారు. ఇదిలా ఉండగా బృందాన్ని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కాలేజీ అభివృద్ధికి సహకారం అందించాలని కోరుతూ వినతిపత్రాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ప్రముఖ నేత్ర వైద్యులు ఎ.రామలింగారెడ్డి, డాక్టరు కమలాహసన్‌రావు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, ఎంఇఒ వి.నాగయ్య, సీనియర్ లెక్చరర్ కె.ఆదినారాయణ, విశ్రాంత డిఇఒ జి.రామకృష్ణారావు, విశ్రాంత శాస్త్రవేత్త సత్యనారాయణరెడ్డి, ఇంజినీరు ఎస్.రామనాథ్,, కె.దుర్గాప్రసాదు పాల్గొని తమ అభిప్రాయాలను చెప్పారు.

12న ఐటిఐ కాలేజీలో మెగా జాబ్‌మేళ

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈ నెల 12న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ సిహెచ్‌ఎస్‌వి ప్రసాదుబాబు శుక్రవారం తెలిపారు. 2023 జూలై నెలలోపు అన్ని ట్రేడ్స్‌కు సంబంధించి మొదటి, రెండోవ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులు హాజరవ్వొచ్చని చెప్పారు. ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభం ఆవుతుందన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు
5
శనివారం 7 అక్టోబర్ 2023

కాంట్రాక్టర్ల సమస్యలపై ప్రతి శుక్రవారం గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

కాంట్రాక్టర్లు వర్క్ అగ్రిమెంట్ పొంది, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమణాలు పాటిస్తూ పూర్తి చేయాలని, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారనికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్లో కాంట్రాక్టర్లతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు నిర్వహించే కాంట్రాక్టర్ల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ గ్రీవెన్స్లో వారు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. వాటి పరిష్కారం నిర్దేశిత గడువులో చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్లు తాము పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లుల ఆన్ లైన్ చేయడం, చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యలను ప్రతి శుక్రవారం జరిగే స్పెషల్ గ్రీవెన్స్లో తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. కాంట్రాక్టర్లు అందించిన ఆర్జీలను, ఫిర్యాదులను ప్రత్యేకంగా నమోదు చేయాలని, వారి సమస్యలు పరిష్కారం అయ్యాక తెలియచేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో కూడా జాప్యం లేకుండా అన్ని స్టేజిల్లో వేగంగా రికార్డ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్.ఈ.ని ఆదేశించారు. కాంట్రాక్టర్లు కూడా తాము చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.



కాంట్రాక్టర్ల నుండి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

కార్పొరేటర్ల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు :కార్పొరేటర్ల నుండి అందే ఫిర్యాదులు, ఆర్జీల పరిష్కారంపై వార్డుల వారీగా నివేదికలు ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కారా నికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు వార్డుల వారీగా కార్పొరేటర్లు అందించిన అర్జీలు, వాటి పరిష్కారంపై నివేదిక ఇవ్వాలని ఆయా విభాగాదిపతులను ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్పొరేటర్ల నుండి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనలను క్రమపద్ధతిలో రికార్డు చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలిపేలా అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న ఫెడరేషన్ నాయకులు

ఢిల్లీలో జర్నలిస్టుల అరెస్టులపై నిరసన

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :రాజధాని ఢిల్లీలో జర్నలిస్టుల ఇళ్లపై ఎన్ఐఎ సోదాలు నిర్వహించడం, మీడియాపై దాడి జరగడం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తెనాలి డివిజన్ అధ్యక్షులు మంచికలపూడి రవికుమార్ తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో న్యూస్ క్లిక్ ఎడిటర్ అరెస్టు, మరికొంతమంది మీడియా ప్రతినిధులపై అమానుష చర్యలను ఖండిస్తూ తెనాలి డివిజన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు శుక్రువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారి బి.వెంకట స్వామికు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ ఎన్ఐఎ సోదాలు పేరిట ఆన్లైన్ పోర్టల్ న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రభీర్ పుర్కాయస్థను అమానుషంగా అరెస్టు చేయటం బాధాకరమన్నారు. చట్టపరమైన నిబంధనలు పాటించకుండా మీడియా స్వేచ్ఛ కు సంకెళ్ళు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఎంతో కీలకంగా ఉన్న ల్యాప్ టాప్స్, మొబైల్ ఫోన్లు పోలీసులు స్వాధీనపర చుకోవటాన్ని తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ తెనాలి నియోజకవర్గం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కనపర్తి రత్నాకర్ , నియోజకవర్గ అధ్యక్షుడు అంబటి శ్యామ్ సాగర్ ఫెడరేషన్ నాయకులు బచ్చు సురేష్ బాబు, ఎస్ ఎస్ జహీర్, మేకల సుబ్బారావు, పి.పున్నయ్య సభ్యులు బి చంద్రమోహన్, డి నాగరాజు, సిహెచ్ చంద్రశేఖర్, డి వెంకటేశ్వరరావు, కరేటి సాంబశివరావు, వి లక్ష్మణరావు, డి రవికిరణ్, ఎం భాస్కర్ పాల్గొన్నారు.

మీడియాను అణిచివేసేందుకు కుట్ర

ప్రజాశక్తి-గుంటూరు :నిజాలు చెప్పే జర్నలిస్టులపై నిరంకుశంగా దాడులు చేయటం ఎంత మాత్రం సహించరాదని, మీడియాను హింసించి, అణిచివేసేందుకు వ్యవస్థీకత కుట్ర జరుగుతుందని అవగాహ సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. ఆన్లైన్ న్యూస్ పోర్టల్ న్యూస్ క్లిక్పై ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ పోలీసుల దాడిని ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. న్యూస్ క్లిక్పై జరిగిన దాడిని మీడియాపై, ప్రాథమిక హక్కు అయిన భావప్రకటన స్వేచ్ఛపై జరిగిన క్రూరమైన దాడిగా సంస్థ భావిస్తుందన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే కొన్ని మీడియాసంస్థలపై అక్రమ కేసులు బనాయించి అణగదొక్కాలని కేంద్రం ప్రయత్నించటం సహించరాని విషయం అన్నారు. భారత్లో పత్రికాస్వేచ్ఛ ప్రమాదంలో పడిందని ప్రపంచం గగ్గోలు పెడుతుందని, ప్రపంచంలోని మొత్తం 180 దేశాలలో పత్రిక స్వేచ్ఛపై సర్వే జరపగా భారతదేశం 161 స్థానంలో ఉందని అన్నారు.

విఆర్కు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ


ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసు శాఖలో కీలకమైన జిల్లా స్పెషల్ బ్రాంచి (ఎస్బి) విభాగంలో అవినీతి ఆరోపణలు గుప్పు మనడంతో ఇందుకు బాధ్యులుగా పేర్కొంటూ డిఎస్పి ఎ.సుభాష్ను వి.ఆర్కు పంపుతూ డిజిపి కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

ఇవిఎంల పనితీరును పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుంటూరు రెవెన్యూ కళ్యాణ మండపంలో శుక్రవారం బెల్ ఇంజినీర్లు ఈవియంలకు సంబంధించి కంట్రోల్ యూనిట్లకు, బ్యాలెట్ యూనిట్లకు నిర్వహిస్తున్న యాక్సెప్టెన్స్ టెస్టింగ్ను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్రెడ్డి తనిఖీ చేశారు. ఈవియంల పనితీరు, వాటి ఫిట్నెస్ పరీక్షలు నిర్వహిస్తున్న బెల్ ఇంజినీర్ల బందంతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈవియంల పనితీరు పరిశీలనలో భాగంగా యాక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్ ను జిల్లా కలెక్టర్ స్వయంగా బటన్ నొక్కి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకటశివరామిరెడ్డి, తహశీల్దార్లు సాంబశివరావు, ఫణి కుమార్ పాల్గొన్నారు.



నగర మహాసభ కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

పెండింగ్ క్లైమ్స్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లైమ్స్ను వెంటనే విడుదల చేయాలని సంక్షేమ బోర్డును యధావిధిగా కొనసాగించాలని సిఐటియు గుంటూరు నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం డొంకరోడ్డు జోన్ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. బోర్డు నిధుల్ని ప్రభుత్వం ఇతర అవసరాల కోసం దారి మళ్లిస్తుందన్నారు. తక్షణమే బోర్డు నిధుల్ని తిరిగి జమ చేయాలన్నారు. బోర్డు పరిరక్షణకు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. తూర్పు కమిటీ అధ్యక్షులు పి.దీవెనరావు మాట్లాడుతూ ఈనెల 22న జరిగే నగర మహాసభలో గుంటూరులోని భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ సందర్భంగా మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశానికి డొంకరోడ్డు జోన్ అధ్యక్షులు సీతయ్య అధ్యక్షత వహించగా, సమావేశంలో జోన్ కార్యదర్శి కాజాఖాన్, కోశాధికారి ఎన్.సారధి, సత్యనారాయణ, రాజు, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

నేడు శాంతి ర్యాలీకి సన్నాహాలు

టిడిపి, సిపిఐ, జనసేన, ప్రజాసంఘాల భేటి

అనుమతి లేదని డిఎస్పి ప్రకటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జనసేన పార్టీ కార్యాలయంలో టిడిపి, సిపిఐ, జనసేన పార్టీలతో పాటు ,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం శుక్రవారం జరిగింది. శనివారం గుంటూరులో నిర్వహించనున్న శాంతియుత ర్యాలీపై సమీక్ష నిర్వహణ నేతలు చర్చించారు. శాంతియుత ర్యాలీకి అన్నీ మిత్ర పక్షాలు ,ప్రజా సంఘాలు కలసిరావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు లాంటి మహోన్నతమైన వ్యక్తిని అరెస్ట్ చేయడం హైయమైన చర్యగా పలువురు నాయకులు అభివర్ణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రపూరిత రాజకీయాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టడానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు మాట్లాడుతూ శాంతియుత ర్యాలీకి జనసేన పార్టీ తమ సంఘీభావాన్ని ప్రకటించిందన్నారు. గుంటూరు లాడ్జి కూడలి నుంచి మార్కెట్ కూడలి గాంధీ విగ్రహం వరకు శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ధర్మాగ్రహ శాంతియుత ర్యాలీలి నిర్వహిస్తున్నామన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్, రాజ్యాంగాన్ని ఖునీ చేసిన వైసీపీ ప్రభుత్వం పై ప్రత్యేక పోరాటం ప్రకటిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, మిత్రపక్షాలు కూడా కలసి పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో30యాక్ట్ అమలులో ఉందని పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్నారు. ఇప్పటికైనా పోలీసులు తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, ఆలపాటిరాజేంద్ర ప్రసాద్, నన్నపనేని రాజకుమారి, పార్టీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్కుమార్, నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు తదితరులుపాల్గొన్నారు.

ర్యాలీకి అనుమతి లేదు : డిఎస్పి

టిడిపి, సిపిఐ, జనసేన నాయకులు కలిసి తలపెట్టిన ర్యాలీకి అనుమతి లేదని డిఎస్పి ఉమామహేశ్వర రెడ్డి తెలిపారు. గుంటూరులో సెక్షన్ 30తోపాటు 144సెక్షన్స్ అమలులో ఉన్నాయని తెలిపారు. ర్యాలీ నిర్వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు.



మెప్మా కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న వివిధ సంఘాల నాయకులు

డ్వాక్రా నిధులు దారిమళ్లించారు

చర్యలు తీసుకోవాలని మెప్మా ఆఫీసు ఎదుట ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలోని డ్వాక్రా నిధులను దారిమళ్లించిన వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారత దళిత గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్, మెప్మా కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. అఖిల భారత దళిత గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గంటా ప్రభుదాస్ మాట్లాడుతూ గుంటూరులో భారీగా నిధులు దారిమళ్లించారని కొంత మంది వ్యక్తి ప్రయోజనాలకు ఉపయోగించుకుని మహిళలను మోసం చేశారని తెలిపారు. గుంటూరు నగరంలో మెప్మా ,గుంటూరు నగర పాలక సంస్థ ఉపా సెల్ పరిధిలో గల డ్వాక్రా మహిళల పొదుపు సంఘాలలో మహిళా సభ్యుల నుండి అక్రమముగా చట్ట వ్యతిరేకంగా పలువురు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడ్డారని వీరికి బ్యాంకర్లు సహకరించారని తెలిపారు. ఈ అంశాలపై ఉన్నత స్థాయి విచారణచేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారులు, వివిధ సంఘాల నాయకులు నాదెండ్ల బ్రహ్మయ్య, దళిత, ప్రజా సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, బత్తుల విల్సన్, పాగళ్ళ ప్రకాష్, ముత్తయ్య, మీగడ జాన్ బాబు, జొన్నలగడ్డ శ్రీకాంత్,మహిళలు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో, మెప్మా ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో మెమోరాండం అందచేశారు.



మాట్లాడుతున్న సత్కార గ్రహీత శ్రీనివాసరావు

పాజిటివ్ దృక్పథంతో ఎక్కడైనా రాణిస్తారు

స్టేట్ వేర్హౌసింగ్ గోడౌన్స్ రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తెనాలి

ఉద్యోగిలో అంకితభావం, విధి నిర్వహణలో పాజిటివ్ దృక్పదం ఉంటే ఎక్కడైనా రాణిస్తారని వేర్హౌసింగ్ గోడౌన్స్ రీజనల్ మేనేజర్ మున్నంగి శ్రీనివాసరావు అన్నారు. మూడేళ్లుగా ఏపి స్టేట్ వేర్హౌసింగ్ గోడౌన్స్ తెనాలి మేనేజర్గా పనిచేస్తున్న ఆయన రీజనల్ మేనేజర్గా పదోన్నతి పొంది విజయవాడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు వీడ్కోలు పలుకుతూ, ఆయన స్థానంలో ఆ శాఖ ప్రదాన కార్యాలయం నుంచి వచ్చిన మేనేజర్ సుబ్రహ్మణ్యంకు స్వాగతం పలుకుతూ శుక్రవారం గోడౌన్స్ ప్రాంగణంలో కార్యాలయం సిబ్బంది అభినందన సభ నిర్వహించారు. సభలో రిటైర్డ్ జనరల్ మేనేజర్ సాంబశివరావు, రిటైర్డ్ మేనేజర్ శివనాగేశ్వరరావు పాల్గొని శ్రీనివాసరావు సేవలను ప్రశంసించారు. విధినిర్వహణలో ఆయన చూపిన తెగువను ప్రశంసించారు. అలాగే యూనియన్ రాష్ట్ర నాయకులుగా కూడా పనిచేస్తున్న శ్రీనివాసరావు ఉద్యోగుల సంక్షేమం కోని పనిచేస్తున్నారని, ఓర్పు, నేర్పు, సహనం ఆయనకే సొంతమని కొనియాడారు. ఆయన పనితీరు ఉద్యోగులకు స్పూర్తిదాయకమన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. సత్కార్ గ్రహీత శ్రీనివాసరావు మాట్లాడుతూ వేర్హౌసింగ్ గోడౌన్స్ లో వివిధ హెూదాల్లో 33 సంవత్సరాలుగా పనిచేశానని, అందులో 16 సంవత్సరాల తన సర్వీసు తెనాలి ప్రాంతంలోనే ఉండటం సంతోషమన్నారు. రైతులు పంటను గోడౌన్స్లో దాచుకోవటం మొదలు, దానిపై వారికి రుణాలు ఇప్పించటం, ఏదైనా విపత్కర పరిస్థితుల్లో నష్టం వాటిల్లితే ప్రభుత్వ పరంగా వారిని ఆదోకోవటం వంటి కార్యక్రమాలో తన విధినిర్వహణలో ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. తన 33 ఏళ్ళ ఉద్యోగ జీవితంలో సహెూధ్యోగుల సహకారం గొప్పదన్నారు. కార్యక్రమంలో ఐడిబిఐ మేనేజర్ తులసి, బేవరేజెస్ గోడౌన్స్ మేనేజర్ హరిబాబు, ఎన్ఈఆర్ఎల్ ప్రతినిధి అరుణ్కుమార్, హమాలీల కాంట్రాక్టర్ కనకరత్నం, రైతులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి



మాదలలోని వైద్య శిబిరంలో జెసి శ్యాంప్రసాద్

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మాదలలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. వైద్యసేవల తీరుపై డాక్టర్లతో మాట్లాడారు. రోగులను పరామర్శించారు. ఏడు రకాల వ్యాధులకు వైద్య సేవలు అందించి మందులు అంది సున్నట్లు వైద్యులు ఆయనకు తెలిపారు. ఆరగ్య సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరవుపేట పట్టణంలోని పాతూరు సచివాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజా ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేసిందన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పురపాలక సంఘం పరిధిలో 1,2,3,4, సచివాలయాలు 6,7,8,9, వార్డుల పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ రజక కాలనీలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని మాట్లాడారు. కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్ఒ, మున్సిపల్ కమిషనర్ సిహెచ్గోవిందరావు,సొసైటీ చైర్మన్ కొండవీటి ఆంజ నేయులు, కౌన్సిలర్లు పార్వతి,వెల్సన్, ఎనిమిదవ వార్డు ఇన్ ఛార్జి తాళ్ల అంజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-రొంపిచర్ల

రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని తురుమెళ్ళలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన 352 మందికి వివిధ వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. 145 మందికి వివిధ వ్యాధులకు సంబంధించిన రక్తపరీక్షలు నిర్వహించారు. అదే విధంగా 58 మందికి హిమోగ్లోబిన్, 58 మందికి ర్యాబీస్, ఐదు గురికి మలేరియా, 4 గురికి డెంగ్యూ, 20 మందికి యురిన్, 4గురికి ఇసిజి పరీక్షలు నిర్వహించారు. ఆయా వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాటం శ్రీనివాసరావు, గైనకాలజీ వైద్యులు డాక్టర్ భారతిదేవి,ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ వి.చంద్రతేజ,రొంపిచర్ల,వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పి.జగన్ నరసింహారెడ్డి, డాక్టర్ బి.మురళీధర్ పాల్గొన్నారు.

9 లోపు ఈ- పంట నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



పాకాలపాడు ఆర్‌బికెలో యూరియా నిల్వలును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళి

ఈ నెల 9వ తేదీ లోపు ఈ పంట నమోదు చేసుకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళీ రైతులకు విజ్ఞప్తి చేశారు.సత్తెనపల్లి మండలం పాకలపాడు రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి శుక్రవారం సందర్శించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఖరీఫ్ సీజన్‌లో ప్రత్తి, మిరప, వరి మరియు వివిధ పంటలు సాగు చేసుకున్న రైతులు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఈ పంట నమోదు,ఇ-కెవైసి సంబంధిత రైతు భరోసా కేంద్రం లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ పంట నమోదు చేసిన రైతుల వివరాలు సోషల్ ఆడిట్ కు ప్రతి గ్రామ సచివాలయంలో ఈ నెల 10 వ తేదీ నుంచి 15 వరకు ప్రదర్శించటం జరుగుతుందని చెప్పారు. రైతుల పంట నమోదులో ఏమైనా సమస్యలు వున్నట్లయితే ఈ నెల 18 వ తేదీ నుంచి 19 వ తేదీ వరకు గ్రీవెన్స్‌లో స్వీకరించనున్నట్లు చెప్పారు. 20వ తేదీన ప్రతి గ్రామ సచివాలయంలో తుది జాబితా ప్రదర్శిస్తామని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో యూరియా,కాంప్లెక్స్ ఎరువులు సమద్దిగా నిల్వలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో సత్తెనపల్లి సబ్ డివిజన్ ఇన్‌ఛార్జి ఎడిఎ ఎస్.శ్రీధర్‌రెడ్డి, పాకలపాడు ఉద్యానవన , వ్యవసాయ సహాయకులు తస్లీమా,జానీ బాషా పాల్గొన్నారు.

రూ.40.40 లక్షలు నిధులు విడుదల

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణము, సచివాలయాల నిర్మాణానికి అదనంగా 40.40 లక్షలు నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ డిఇ పాశం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జట్టిపాలెం సిసి రోడ్లకు రూ.18.50 లక్షలు మెట్టు గుడుపాడులో సీసీ రోడ్లకు రూ.7.50 లక్షలు ఒక్కో సచివాలయా నికి అదనంగా రూ.3.60 లక్షలు చొప్పున నాలుగు సచి వాల యాలకు మంజూరైనట్లు చెప్పారు. మంజూరైన నిధులు ఎన్‌ఆర్‌ఈజీకి చెందినవని అన్నారు.

కాంగ్రెస్ నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



రాహుల్ గాంధీకి దేశ ప్రజలలో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రధాని మోడీ, బిజెపి నేతలు సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీని రావణాసురుడిగా చిత్రీకరిస్తూ ప్రచారం చేయడం బిజెపి అసమర్థతకు నిదర్శనమని డిసిసి పల్నాడు జిల్లా అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్ విమర్శించారు. తమ నేత రాహుల్‌ని కించ పరిచేలా బిజెపి చేస్తున్న ప్రచారానికి వ్యతిరేకంగా శుక్ర వారం స్థానిక వినుకొండ రోడ్డులో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. బిజెపికి, ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో చిలకలూరిపేట కన్వీనర్, ఏపీసీసీ అధికార ప్రతినిధి ఎం.రాధాకృష్ణ, నాయకులు అనిల్, పల్నాడు జిల్లా నాయకులు ఎస్.ఎం భాష, సీదా కృష్ణ, ఆకారపు పూర్ణ, నిమ్మకాయల బాజీ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడు రావిళ్లకు నివాళి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



రావిళ్ళ లక్ష్మీనారాయణ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు.

టిడిపి నేత టిడిపి లీగల్ సెల్ న్యాయవాది రావిళ్ళ లక్ష్మీనారాయణ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో, నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నివాళులర్పించారు. సుదీర్ఘ కాలం పార్టీ పటిష్టతకు లక్ష్మీనారాయణ తన వంతు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ చదలవాడ అరవింద బాబు, రాష్ట్ర టిడిపి డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వర్లు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కె.కిరణ్, జిల్లా టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ అలీబాష ,నియోజకవర్గ లీగల్ సెల్ అద్యక్షులు చెన్నుపాటి నాగేశ్వరరావు, నరసరావుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఎన్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని లంకెల కూరపాడులో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రీసర్వే పక్రియ త్వరితగతిన పూర్తి చేయా లని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ భవానీ శంకర్, డిటి లక్ష్మీ ప్రసాద్,ఈవోఆర్డి రూపావతి,వైద్య సిబ్బంది పీటర్ డామియెన్ పాల్గొన్నారు.

10న జిల్లా షూటింగ్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు అక్టోబర్ 10వ తేదీన సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కోనంకి కిరణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. 01-01-2007 తర్వాత జన్మించిన వారు తమ ఆధార్ కార్డుతో 10వ తేదీ ఉదయం 9:30 గంటలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 9848655755 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



అబ్బూరులో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

అర్హత గలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను పారదర్శకంగాఅందించామని,అబ్బూరు గ్రామానికి మూడేళ్ల కాలంలోనే రూ.15.4 కోట్ల నిధులు ప్రజలకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం అబ్బూరులో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ గ్రామంలో 798 గృహాలను ఆయన సందర్శించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ముద్రించిన సంక్షేమ కరపత్రాలు అందించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా. గ్రామా నికి రూ.11.89 కోట్ల సంక్షేమ సాయం, రూ.3.5 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామానికి మరో రూ.20 లక్షలు నిధులు మంజూరవు తాయని, వీటితో మిగిలిపోయిన సిమెంట్ రోడ్లు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మురుగు కాల్వ వ్యవస్థ, విధి దీపాలు , ఇతర కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వరరెడ్డి, రూరల్ మండలం అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమరావు,సర్పంచ్ గొలదారి అన్న పూర్ణమ్మ, ఎంపీటీసీ మానుకొండ అలేఖ్య, ఎంపీడీవో సత్యనారాయణ, తహశీల్దార్ సురేష్ నాయక్ పాల్గొన్నారు.



పాఠశాలలో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కార్యాలయ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. సీనియర్ ఆడిట్ ఆఫీసర్ రవిచంద్ర, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో రికార్డుల తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుతీరు పాఠశాలకు విడుదలైన గ్రాంట్లు, శిక్షణ కార్యక్రమాలు, ఎన్డు లైన్ టెస్ట్ రికార్డులు నిర్వహణ, ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్లు ,క్షుణ్ణంగా పరిశీలించారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ తీర్మానాలు వివిధ రికార్డులు నిర్వహించిన తీరును పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ రమణకు వారు పలు సూచనలు చేశారు.



ఎపిఆర్ఎస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస యాదవ్ ఎన్నికపై హర్షం

ప్రజాశక్తి -కారంపూడి

ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కారంపూడి మండల తహశీల్దార్ జి. శ్రీనివాస యాదవ్ ఎన్నిక కావడంపై మండల రెవిన్యూ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ కీర్తి స్రవంతి, మండల సర్వేయర్, మండల వీఆర్వోల సంఘం నాయకులు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్ఏలు మండల తహసీల్దార్ జి. శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించారు.



2024 -25 ఏడాదిలో జరగనున్న

ఉపాధి హామీ పనులపై అవగాహన

ప్రజాశక్తి - అచ్చంపేట

రైతులకు ఉపయోగపడే విధంగా ఉపాధి హామీ పనులు గుర్తించాలంటూ ఎంపిపి ముఖ్య రజనీబాయ్ కృష్ణ నాయక్ అన్నారు. శుక్రవారం అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో అచ్చంపేట మండలంలో చేపట్టబయే పనులపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ పి. శివ సుబ్రహ్మణ్యం వైస్ ఎంపీపీ టి.నాగరాజు మండల ప్రజా ప్రతినిధులు చిలకా చంద్రయ్య హాజరయ్యారు. ఎపిఒ నాగ శ్రీనివాస్ మాట్లాడుతూ 96 రకాల ఉపాధి హామీ పథకం పనులు ఎంపిక గురించి వివరించారు. ఉపాధి హామీ జెఇ బి.రమణమూర్తి ,ఎంపీడీవో మాట్లాడారు. **కారంపూడి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024 - 25 ఆర్థిక సంవత్సరం ప్లానింగ్ ప్రాసెస్, గ్రామ సభలు, పనులు గుర్తింపు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరెడ్డి,ఎంపిపి మేకల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నీటిపారుదల యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి. జోసఫ్ పాల్గొన్నారు.

డ్రెయిన్స్ నిర్మించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జున రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మొసలి పకీరయ్య

మంగళగిరి మండలం ఆత్మకూరులో డ్రెయిన్ లు నిర్మించాలని కోరుతూ పంచాయితి రాజ్ విభాగ ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జునరెడ్డికి సిపిఎం నాయకులు, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు మొసలి పకిరయ్య శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పకిరయ్య మాట్లాడుతూ నిమ్మగడ్డ రామ్మోహనరావు కాలనీ, జగనన్న కాలనీ, వైఎస్ రాజశేఖరరెడ్డి కాలనీలలో డ్రెయిన్ల నిర్మాణం నిర్మాణం సరిగా లేనందున మురుగునీరు పారుదల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే డ్రెయిన్లు నిర్మించి మెయిన్ డ్రెయిన్ లో కలపాలని కోరారు.



గ్రామ పునర్నిర్మాణ సంస్థ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

గ్రామ పునర్నిర్మాణ సంస్థ కేంద్ర కార్యాలయంలో 52వ జనరల్ బాడి సమావేశం శుక్రవారం జరిగింది. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి. గోపాలరావు నేతృత్వంలో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి గ్రామ పునర్నిర్మాణ సంస్థలో సభ్యునిగా చేరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డి.చక్రపాణి, సెక్రటరీ కవితా డేవిడ్, ఆపరేషనల్ డైరెక్టర్ పీటర్ డానియెల్, ఫాదర్ వేళంగిణి పాల్గొన్నారు. కాగా, 1971లో పెదకాకానిలో గ్రామ పునర్నిర్మాణ సంస్థ ఏర్పడింది. గత 52 సంవత్సరాల కాలంలో 440 గ్రామాల్లో బాలికల విద్య, గ్రామాల సాధికారత, నైపుణ్యాల అభివృద్ధి తదితర కార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామాల పునర్నిర్మాణంలో భాగస్వామ్యమైంది.

పొన్నూరు-అరుణాచలం ప్రత్యేక ఆర్టీసీ సర్వీసు 26న ప్రారంభం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు ఆర్టీసీ డిపో నుండి ఈ నెల 26 తేదీన అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసు బయలుదేరనుందని పొన్నూరు ఆర్టీసీ డిఎం అజితకుమారి శుక్రవారం తెలిపారు. శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ (శ్రీపురం), అరుణాచలం, కంచి, విష్ణు కంచి, శివ కంచి పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చని, రానుపోను టికెట్ ఛార్జి రూ.2,420 ఉంటుందని చెప్పారు. వివరాలకు 9000720 816, 9581428948, 9959308068,9133799032 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-పెదనందిపాడు



నాగులపాడులో వాడుక నీటి చెరువును పరిశీలిస్తూ గ్రామస్తుల సూచనలు వింటున్న జెసి రాజకుమారి

మండలంలోని పెదనందిపాడు, నాగులపాడు గ్రామాలలో తాగునీటి, వాడుకనీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. శుక్రవారం పెదనందిపాడు, నాగులపాడు గ్రామాల్లోని మంచినీటి చెరువులను, ఫిల్టర్ బెడ్ లను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెదనంది పాడులో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్య క్రమంలో భాగంగా గ్రామస్తులు నీటి సమస్య గురించి తమ దృష్టికి తీసుకువచ్చారని, ఆ సమస్యను పరిష్కరించడానికి త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంచినీటి చెరువులు, ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించే నిమిత్తం పెదనందిపాడుకు వచ్చినట్లు చెప్పారు. గ్రామస్తులు కొన్ని సూచనలు చేశారని వాటిని పరిశీలించి త్వంలో పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి, డిఎల్పిఓ లక్ష్మణరావు పెదనంది పాడు తహశీల్దార్ షేక్ మహబూబ్ సుభాని, ఈవోపీఆర్డీ ఎన్ సాయి లీల, పంచాయతి కార్యదర్శి జి.నాగయ్య, పాల్గొన్నారు.

పార్కింగ్ ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి-మంగళగిరి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి , ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తదితరులు

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వెనుక వైపు ఉన్న సికె గర్ల్స్ హై స్కూల్ స్థలంలో అర ఎకరం విస్తీర్ణంలో పార్కింగ్ ఏర్పాటుకు మధ్యలో గోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పరిశీలించారు. దేవస్థానానికి వచ్చే యాత్రి కులకు పార్కింగ్ ఇబ్బంది లేకుండా చేయడానికి చర్యలు తీసుకున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, దేవస్థానం ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పాల్గొన్నారు.



టిడిపి శాంతి ర్యాలీకి తరలిరండి

ప్రజాశక్తి-తెనాలి

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా శనివారం గుంటూరులో చేపట్టనున్న శాంతి ర్యాలీకి తరలి రావాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక స్వరాజ్ టాకీస్ ఆవ రణలో చేపట్టిన టిడిపి నిరసన దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి ర్యాలీ నిర్వహణపై జనసేన, సిపిఐ నాయకులతో కూడా సంప్రదించామని, అంతా పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో వైసిపి పాలనతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రశ్నించే వారిని కేసులు, అక్రమ అరెస్టులతో ప్రభుత్వం వేధిస్తోందన్నారు. ఈ పరిణామాలను సమిష్టిగా తిప్పికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు.


రేపు అవగాహన ఆరోగ్యసభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఆరోగ్యసభలో భాగంగా రేపు ఉదయం 11 గంటలకు స్థానిక అరండల్‌పేట 15/1లోని సంస్థ కార్యాలయంలో మానసిక ఒత్తిడి, దిగులు, మతిమరుపు సమస్యలపై ఆరోగ్యసభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో మానసిక వైద్యులు డాక్టర్ కె.సురేష్‌కుమార్, డాక్టర్ హరిమానస, డాక్టర్ రాజ రాజేశ్వరి, డాక్టర్ అపూర్వ, డాక్టర్ యాస్మిణ్, డాక్టర్ లక్ష్మి పాల్గొని ప్రసంగిస్తారని అన్నారు. ఆరోగ్యాభిలాషులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - చేబ్రోలు



వాలీబాల్ పోటీలకు ఎంపికైన వేజెండ్ల జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు వేజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొట్టుపల్లి సుమశ్రీ, షేక్ సోనీ, బింగినపల్లి మనీషా, చల్లగిరి దుర్గాప్రసన్న ఎంపికైనట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు టి.విజయశ్రీ తెలిపారు. జిల్లా స్థాయి వాలీబాల్ అండర్-17 బాల బాలిల పోటీలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ జి ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారని, ముఖ్య అతిథి డిప్యూటీ ఈవో ఎం.నిర్మల ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 7,8,9 తేదీలలో కడప జిల్లాలోని మైదు కూరులో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ అండర్-17 పోటీలలో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఎంపికల్లో గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.ప్రతాప్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ కార్యదర్శి సిహెచ్ వినయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌కె.కరీముల్లా, మస్తాన్‌రెడ్డి, నందకుమార్, రజనీనాయక్, ఎం.రవి, ఎన్ రవి, పాఠశాల పిఇటి ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం అండర్-19 ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి రాష్ట్ర స్థాయి కబడ్డీ టీం సెలక్షన్స్ పోటీలు నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ వై.పెద్దబ్బాయి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుచరిత తెలిపారు. చేబ్రోలు జూనియర్ కళాశాల బాలికల విభాగం నుండి ఎస్.కె రేష్మ, బాలుర విభాగం నుండి ఎస్.కె యాసిన్‌లు రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు ఎం పికైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 25 కళాశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థినీ విద్యార్థులు సెలక్షన్స్ లో పాల్గొన్నారని తెలిపారు. బాలికల కబడ్డీ విభాగంలో ఎస్ కె రేష్మ , షాజనాభి, హరిత, పూర్ణ శ్రీ, నందు, జోష్ణ, స్వాతి, యామిని,బాల సైదులు, కే దివ్య, బాలుర విభాగంలో ఎస్ కె యాసిన్ అబ్త్ భుమర్, సుభాని, బాలాజీ, శివ వంశి, శివకష్ణ ,సాయి శివ నాయక్, గోపి, నాగూర్ వలి, మణికంఠ రెడ్డి, నాగరాజు, తరుణ్, మోహన్, నాగుల్ బాజీ, ప్రేమ్ కుమార్, మణికంఠ రెడ్డి, లక్ష్మీనారాయణ, కరున్ కుమార్‌లు రాష్ట్ర స్థాయి కబడ్డీకి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అండర్-19 గుంటూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జి. కోటేశ్వరి, ఆయా కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు ఉదయ భాస్కర్ , శంకర్ రెడ్డి ,సుధాకర్ రెడ్డి, పద్మాకర్ పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలకు ఎంపికైన చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు



ఎన్ఎల్వి కృష్ణారావును సత్కరిస్తున్న వివిఐటి బృందం

వివిఐటిలో విజయవంతంగా ఎక్సోషియా-2023

ప్రజాశక్తి- తెనాలి

నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా విద్యార్థి విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఎక్సోషియా2023 సాంకేతిక సదస్సు శుక్రవారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా టాటా ఎలక్ట్రికల్ కంపెనీ మాజీ ప్రాజెక్టు మేనేజర్ ఎన్ఎల్వీ కృష్ణారావు పాల్గొన్నారు. నాలుగు విభాగాలలో నిర్వహించిన సాంకేతిక సదస్సులో వివిధ కళాశాలలో నుంచి 740 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఫ్యూజన్ విజన్, కాంపోనెంట్ క్యాపర్, బైండ్ సర్క్యూట్స్, ఆప్టిక్ మిస్టరీ అంశాలలో పోటీలు జరిగాయి. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ కోర్ బ్రాంచ్‌లకు ప్రాధాన్యత ఎప్పటికీ ఉంటుందన్నారు. విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే దిశగా ఆలోచనలు ఉండాలన్నారు. నూతన ఆవిష్కరణలకు విద్యా ర్థులు శ్రీకారం చుట్టాలన్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు పరిణితి చెందాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జున రెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎస్ కుమారస్వామి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవి నరేష్ బాబు పాల్గొన్నారు.



చిరు వ్యాపారులకు బండ్లు పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి :స్థానిక 27వ వార్డుకు చెందిన చిరు వ్యాపారులకు మూడు తోపుడు బండ్లు, రెండు ప్లాట్ ఫామ్ బండ్లు శుక్ర వారం గోపాలకృష్ణ సెంటర్‌లో టిడిపి నాయకులు పంపిణీ చేశారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.మణికంఠ, ఎం.రమేష్ బాబు, షేక్ రియాజ్, కె.అంకమ్మరావు, జి.దుర్గారావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు, (ఇన్‌సెట్) రాజబాబు

సిపిఎం అభిమాని రాజబాబు మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణానికి చెందిన కుంచా రాజబాబు (67) శుక్రవారం మృతిచెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారం రోజుల్లో ఆసుపత్రిలో చికిత్స అనంతరం రెండు రోజుల క్రితమే వైద్యుల సలహా మేరకు ఇంటికి తీసుకొచ్చారు. రాజబాబు మృతికి సుందరయ్య సాంస్కృతిక సేవా సమితి కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి, దుర్గి కోదండరామయ్య, గంజి శ్రీనివాసరావు, బిట్రా రామారావు, దుర్గి వెంకటేశ్వరరావు, ఎల్ఐసి రామిరెడ్డి, టిడిపి వంగర శంకరరావు, విశ్రాంత రైల్వే ఉద్యోగులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజబాబు సాయంత్రం తాడేపల్లిలో నిర్వహించారు.

దోమల నివారణకు చర్యలు



ప్రజాశక్తి-దుగ్గిరాల : దోమల నివా రణా చర్యల్లో భాగంగా మండల కేంద్రం దుగ్గిరాలలో పంచాయతి సిబ్బంది శుక్రవారం డ్రైనేజీ కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్ మాట్లాడుతూ దోమల నివారణకు గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అన్ని రకాల చర్యలు చేపడ తున్నట్లు చెప్పారు.

కరాటేలో విఐటి విద్యార్థికి బంగారు పతకాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి లోని విఐటి విశ్వ విద్యాలయం విద్యార్థి బంగారు పతకాలు సాధించాడు. అక్టోబర్ 1న రాజమహేంద్ర వరంలో జరిగిన 2వసౌత్ ఇండియన్ కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో బిటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థి కె.వినయ్ కరాటే పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతు కరాటేలో అత్యుత్తమ ప్రతిభతో బంగారు పతకాలు సాధించడం చిన్న విషయం కాదన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సందర్భంగా వినయ్‌కు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఖదీర్ పాషా, డాక్టర్ జగదీష్ చంద్ర, డాక్టర్ రామచంద్రరావు పాల్గొన్నారు.




బంగారు పతకాలు సాధించిన వినయ్ తో విసి తదితరులు

వేమన పద్యానికి చిత్ర రూపం

వర్సిటీ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థికి తృతీయ బహుమతి

ప్రజాశక్తి - ఎఎన్‌యు :వేమన పద్యానికి చిత్ర రూపం ఇచ్చిన ఆచార్య నాగార్జున ఫైనార్ట్స్ విభాగం విద్యార్థి గర్నెపూడి కళ్యాణ్‌కుమార్ ఇటీవల తిరుపతిలో వేమన పద్య భావ చిత్రకళా పోటీలలో తృతీయ బహుమతి సాధించారు. "నీటిలో స్వేచ్ఛగా సంచరించే చేప భూమి మీదకు రాగానే చనిపోతుంది. అది స్థాన మహిమకాని తన మహిమ మాత్రం కాదు కదా" అని వేమన పద్యం "నీళ్ళలోన మీను నిగిడి దూరము పారు"కి అర్థం అచ్చుగుద్దినట్లు తాను వేమన పద్యానికి అనుగుణంగా వేసిన పెయింటిం గ్‌నకు బహుమతి లభించిందని కళ్యాణ్ తెలిపారు. ఎంటిఎంసి పరిధి నులకపేటకు చెందిన కళ్యాణ్ కుమార్ ప్రత్యేక విభాగంలో బహుమతి సాధించడాన్ని పలువురు అభినందించారు. అక్టోబర్ 29న తిరుపతిలో నిర్వహించే బహుమతి ప్రధానోత్సవంలో బహుమతి, రూ.2వేలు ప్రోత్సాహక నగదు, నిర్వాహకుల నుండి ప్రశంసాపత్రం, మెమోంటో అందుకుంటానని కళ్యాణ్ తెలిపారు.





క్రీడాకారులకు విసి అభినందన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

దేశ కీర్తిని ఇనుమడింప చేసేందుకు క్రీడా రంగం కీలక పాత్ర పోషిస్తుందని విసి ప్రొఫెసర్ పి రాజశేఖర్ తెలిపారు. యూనివర్శిటీలో ఇటీవల ముగిసిన అంతర్ జిల్లాల క్రీడా పోటీల్లోరాష్ట్ర స్థాయి జట్టుకు విజేతలైన క్రీడాకారులు వర్సిటీలో జాతీయ స్థాయి పోటీలకు శిక్షణ పొందుతున్నారు. శుక్రవారం క్రీడాకారులను వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య కరుణ, యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య జాన్సన్, కోచ్ కృష్ణమోహన్ , యోగా కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణ క్రీడాకారులను అభినందించారు. ఆనంతరం జాతి స్థాయి పోటీలలో ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షిస్తూ వారికి అభినందనలు తెలియజేశారు.



బిజెపి తీరుకు నిరసనగా కాంగ్రెస్ ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీని రావణాసురుడుగా పేర్కొంటూ బిజెపి నాయకులు సోషల్ మీడియాలో ప్రచారం చేయడాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం స్థానిక హిందూ కళాశాల సెంటర్‌లో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ, పార్టీ జిల్లా అధ్యక్షులు లింగం శెట్టి ఈశ్వరరావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్ నాయకత్వంలో పెద్ద సంఖ్యలోపార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. మస్తాన్ వలీ మాట్లాడుతూ అన్ని రంగాల్లో విఫలమైన నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై పాశావికదాడులకు పాల్పడు తుంద న్నారు. కరోనా సంక్షోభంలోకూడా ప్రజలపై పన్నుల భారం మోపిన గొప్ప ప్రధాన మంత్రి నరేంద్రమోడీగా అభివర్ణించారు. జియస్టి, నిత్యావసర ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ప్రతిదీ పేంచి భారతీయుల ప్రజల జీవనాన్ని దారిద్ర్యరేఖకు దిగువకు తీసుకు వెళ్లారని ధ్వజమెత్తారు. కేవలం హిందూ మతం వారిని రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపు కోవడం తప్ప ఈ దేశంలో అన్ని తరగతుల సంక్షేమం కోసం పనిచేయని ఏకైక ప్రభుత్వం మోడీయేనని అన్నారు. కాంగ్రెస్ నాయకులు జక్క శ్రీనివాస్, అంబటి రత్తయ్య, వెంకటరెడ్డి, మద్ది శ్రీనివాస్, గాలి అశోక్, మౌలాలి, సయ్యద్ జాని గోల్డ్, నూనె పవన్ తేజా, అహ్మద్ బాషా, మల్లవరపు చిన్న, మల్లెల మేషె, మస్తాన్ వలీ, బోడపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు .

విద్యుత్ భారాలపై 9 నుండి ప్రచార ఆందోళనలు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ చార్జీల పెంపుదలను నిరశిస్తూ ఈనెల 9 నుండి 15వ తేదీ వరకూ జిల్లాలో ప్రచార ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు వెల్లడించారు. శుక్రవారం స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, సిపిఐ(ఎంఎల్) న్యూడెమో క్రసీ జిల్లా కార్యదర్శి వి.నరసింహా రావు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమెక్రసీ జిల్లా నాయకులు గనిరాజు, ఎంపిసిఐ(యు) జిల్లా నాయకులు కాల్వ శ్రీధర్ పాల్గొన్నారు. ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలతో ప్రజలను దోపిడీ చేస్తున్న తీరుపై ప్రజల్ని చైతన్యం చేయటమే లక్ష్యంగా ఈ ప్రచార ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ట్రూఅప్, సర్‌ఛార్జీల పేరుతో ప్రజలు తీవ్రమైన ఆర్థిక భారాలను ప్రజలో మోస్తున్నారన్నారు. అదనపు ఛార్జీల వల్ల గతంలో రూ.500 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు రెట్టింపు అయ్యిందన్నారు. నవరత్నాల్లో భాగంగా ప్రజలకు రూ.10 పైసలు ఇచ్చి వారి నుండి రూపాయి లాక్కుటుందని విమర్శిం చారు. విద్యుత్ భారాలు మోపిన గత ప్రభుత్వాలను ప్రజలు గద్దె దించిన అనుభవాలను గుర్తుంచుకోవాలని హితవు పలికారు. జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు జంగాల అజయ్‌కుమార్, వై.నేతాజీ తదితరులు

విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దకే అందించడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు నగర పాలక సంస్థ 54వ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్ పెదరమణమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాతో కలిసి ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని, ఐసీడీఎస్ వారిచే ఏర్పాటు చేయబడిన స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నాడు-నేడు ద్వారా ఆయా రంగాల్లో ఎన్నడూ లేని విధంగా అభివద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలను నూతనంగా మంజూరు చేయడం ద్వారా పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లాలో కొత్తగా మంజూరు చేసిన 32 డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలకుగాను శుక్రవారం 29 ప్రారంభించుకోవటం జరిగిందన్నారు. మిగిలిన మూడు కేంద్రాలను త్వరలోనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సుదీర్ఘ పాదయాత్రలో పేదల ఇబ్బందులు స్వయంగా గమనించి, అధికారంలోకి రాగానే నవరత్నాల ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన అందిస్తున్నా రన్నారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తుందని, ఏఎన్ఎంలు, వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అనారోగ్య బాధితులను గుర్తించి క్యాంప్ గురించి అవగాహన కల్పించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు వైద్యం సంపూర్ణంగా అందాలనే ఉన్నత లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తుందని, నగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో క్యాంపుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన తెచ్చిన విధంగా, ప్రజల వద్దకు వైద్యాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తెచ్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్, డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యకేంద్రం ప్రారంభోత్సవం లో పాల్గొన్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, మేయర్ కావటి, తదితరులు

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ త్రిపురాంతకేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు సిటి

మెడికల్ కాలేజీ, హాస్టల్‌లో నూతన విద్యార్థులను సీనియర్లు ర్యాగింగ్ చేస్తే తీవ్ర స్థాయిలో చర్యలు ఉంటాయని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ త్రిపురాంతకేశ్వర రెడ్డి తెలిపారు. మెడికల్ కళాశాల, హాస్టల్‌లో అధ్యాపకులతో ర్యాగింగ్ నిరోధక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రిన్సిపల్ మాట్లాడుతు కళాశాలకు వచ్చే కొత్త విద్యార్థులతో ఎలా మెలగాలో వివరిస్తూ ఎప్పటికప్పుడు ఒక ప్రత్యేక అధ్యాపక బందన్ని పర్యవేక్షణ కోసం ఉంచామన్నారు. హాస్టల్లో మౌలిక వసతులు, సమస్యలు పరిష్కరించే దిశగా ఈ కమిటీ ఉంటుందన్నారు. విద్యార్థులు కాలేజీ క్యాంపస్‌లోని లైబ్రరీని ఉపయోగించు కోవాలని, డిజిటల్ సమాచారం కూడా అందుబాటులో ఉందన్నారు. తాను ఒంగోలు జిల్లాలోని ఒక సాధారణ రైతు కుటుంబం నుండి వైద్య చదువు నిమిత్తం గుంటూరు మెడికల్ కళాశాలలో చదివి ఇప్పుడు అదే కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. చదువుకునే సమయంలో తమ గురువులు నేర్పించే క్రమశిక్షణతోనే ఇది సాధ్యమైందన్నారు. కళాశాల చదువుకునే ప్రతి విద్యార్థి చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా అందరితో కలిసిమెలిసి ఉండాలన్నారు. ప్రధాన క్యాంపస్‌లో వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై గుంటూరు జనరల్ ఆసుపత్రితో కలిసి శాటిలైట్ ఆధారిత శిక్షణలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ డాక్టర్ టీటీకే రెడ్డి గుంటూరు వైద్య కళాశాలలో 1981లో ఎంబీబీఎస్, 1993లో పీజీ వైద్య విద్యను పూర్తి చేశారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో 1997లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశిం చారు. అనంతరం గుంటూరు వైద్య కళాశాలకు బదిలీ అయి 2003లో అసోసియేట్ ప్రొఫెసర్ గా, 2008లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. గుంటూరు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ 2020 నుంచి 2022 వరకు పనిచేశారు.

